క్లుప్తంగా

కేన్సర్‌పై అశ్రద్ధ వద్దు



కేన్సర్‌పై ఇంటింటా అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: కేన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకుంటూ, ఆరు నెలలకు ఒకసారి వైద్యశాలలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని గోపన్నపాలెం పీహెచ్‌సీ డాక్టర్ రాకేష్, డాక్టర్ రోజా అన్నారు. ఆదివారం గోపన్నపాలెం వైద్యశాలలో వారు మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న కేన్సర్ సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. ఆరోగ్య పరిస్థితులను గమనించుకుంటూ అనారోగ్యం సంభవిస్తే సమీప వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకుని నిర్ధారణ అయితే మందులు తీసుకోవడం ద్వారా వ్యాధి తగ్గుముఖం పడుతుందన్నారు. ఎంపీహెచ్‌ఈఓ సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు కేన్సర్ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరీక్షలకు సంబంధించి సుదీర్ఘంగా ఇంటింటా అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఆదివారం గ్రామ శివారు ప్రాంతాల్లో జరుగుతున్న సర్వేను డాక్టర్ రాకేష్, ఎంపీహెచ్‌ఈఓ పరిశీలించారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ



గుండుగొలనులో శాంతియుత ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

భీమడోలు: క్రైస్తవులపై దాడులను అరికట్టాలని కోరుతూ గుండుగొలనులోని ఆదివారం క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. గుండుగొలను ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు పాకలపాటి యోహాన్, పాకలపాటి జాన్ వెస్లీ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ సువార్త ప్రసంగీకులు పగడాల ప్రవీణ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామంలో వేలాది మంది క్రైస్తవులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. గుండుగొలను కూడలి ప్రాంతమైన రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వారంతా రోడ్డుపై మోకాళ్లపై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు పాకలపాటి యోహాన్, జాన్ వెస్లీ మాట్లాడుతూ క్రైస్తవ సమాజం పరుల మేలు కోరుతుందని, అలాంటి క్రైస్తవులపై ఇటీవల దాడులు పెరిగిపోతున్నాయన్నారు. వాటిని ప్రభుత్వాలు అరికట్టాలని ముక్తకంఠంతో కోరారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ పెద్దలు, సంఘ విశ్వాసులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

కాలిబాట వంతెనలు అధ్వానం

వంతెనల వద్ద పారిశుధ్యం అస్తవ్యస్తం

ఏలూరు (టూటౌన్): నగరంలోని కృష్ణా కాలువపై ఏర్పాటు చేసిన కాలిబాట, సాధారణ వంతెనలు పరిశుభ్రత లోపించి అధ్వానంగా కన్పిస్తున్నాయి. వీటిని కనీసం వారానికో, పదిరోజులకైనా శుభ్రపరిచే పరిస్థితి కన్పించడం లేదు. పైగా కాలిబాట వంతెనలపై బిక్షగాళ్లు చేరి ఆ ఇరుకు వంతెనపైపై బిక్షాటన చేస్తున్నారు. మరోవైపు కాలిబాట వంతెనపై కనీసం శుభ్రం చేయకపోవడంతో చెట్ల ఆకులు, చెత్త సంచులు పేరుకుపోయి దర్శన మిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే పాత బస్టాండ్ ప్రాంతంలోని వంతెన పరిస్థితే ఇలా ఉంటే జనసంచారం తక్కువగా ఉండే కాలిబాట వంతెనల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైందని ప్రజలు వాపోతున్నారు. మరో పక్క బిక్షగాళ్లు తమకు సంబంధించిన సామాన్లు కాలిబాట వంతెన మలుపులో ఒక పక్కగా పెడుతుండటంతో ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంటుందని వాహనదారులు వాపోతున్నారు.

చెత్త తరలింపు వాహనాల నిలుపుదలతో..

మరోవైపు ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటి నుండి నగరపాలక సంస్థ పరిధిలో చెత్తను తరలించే 60 క్లాప్ వాహనాల సేవలను అధికారులు నిలుపుదల చేశారు. దీంతో గత నెలరోజుల నుండి నగరంలో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తుంది. ఉన్న కొద్దిపాటి సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లోనే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో కామన్ ప్రాంతాల్లో చెత్తను శుభ్రపరిచే వారు కరువైపోయారు. దీని వల్లే పబ్లిక్ ప్రాంతాల్లో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పాత బస్టాండ్ కాలిబాట వంతెనపై బిక్షగాడు, పక్కనే చెత్త సంచులు



కాలిబాట వంతెన దిగువన పేరుకుపోయిన చెత్త

పారిశుధ్యం కార్యక్రమాన్ని పర్యవేక్షించాల్సిన నగరపాలక సంస్థ అధికారులకు సైతం వంతెనలు, కాలిబాట వంతెనలను శుభ్రపర్చాలనే ఆలోచన లేకపోవడం బాధాకరమని ప్రజలు వాపోతున్నారు.

మొక్కుబడిగా గ్రీన్ ఏలూరు కార్యక్రమం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మూడో శనివారం గ్రీన్ ఏలూరు, సుందర ఏలూరు నగరంగా తీర్చిదిద్దుతాం అంటూ ప్రజా ప్రతినిధులు, అధికారులు చెబుతున్నా ఆచరణలో అది ఎక్కడా కన్పించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెలలో ఒకరోజు హడావుడిగా కార్యక్రమం నిర్వహించి చేతులు దులిపేసుకుంటున్నారని, ఆ తర్వాత నగరంలో పరిశుభ్రత గురించి పట్టించుకోవడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఎంహెచ్‌ఓ పోస్టు ఖాళీ

ఏలూరు నగరపాలక సంస్థలో గత కొంత కాలంగా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్(ఎంహెచ్‌ఓ) పోస్టు ఖాళీగానే ఉంది. గతంలో పనిచేసిన ఎంహెచ్‌ఓ బదిలీ కావడంతో అప్పటి నుండి ఆపోస్టులో ఎవరినీ నియమించలేదు. దీంతో వన్‌టౌన్ ప్రాంతాన్ని డిప్యూటీ కమీషనర్ శివారెడ్డి, టూటౌన్ ప్రాంతాన్ని అడిషనల్ కమిషనర్ చంద్రయ్యలు పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నారు. పేరుకే వీరు పర్యవేక్షిస్తున్నారని పూర్తి స్థాయిలో అజమాయిషీ చేయడం లేదని ఈ కారణంగానే నగరంలో ఎక్కడి చెత్త అక్కడ పేరుకు పోతుందని నగర వాసులు చెబుతున్నారు.

సిబ్బంది సంఖ్యను పెంచుకోవాలి



పెరిగిన నగర జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచుకోవాలి. సిబ్బంది తక్కువగా ఉండటం, క్లాప్ ఆటోలను, వాటిలో పనిచేసే సిబ్బందిని రద్దు చేయడం, కార్పొరేషన్‌లో ఎంహెచ్‌ఓ పోస్టు ఖాళీగా ఉండడం వంటి కారణాలతో నగరంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకు పోతుంది.

– జె.గోపి, సీఐటీయూ నాయకుడు, ఏలూరు

వారానికోసారైనా శుభ్రం చేయాలి



ఏలూరు కార్పొరేషన్ పరిధిలో ఉన్న కాలిబాట వంతెనలను కనీసం వారానికి ఒకసారైనా శుభ్రం చేయించాలి. కాలిబాట వంతెనలపై బిక్షగాళ్లు ఆవాసం ఏర్పరచుకోకుండా చర్యలు తీసుకోవాలి. వంతెన ఎగువ, దిగువ ప్రాంతాల్లో పక్కగా చెత్త కుప్పలు వేయకుండా ఆంక్షలు విధించాలి.

– ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, సామాజిక కార్యకర్త, ఏలూరు

ఉత్సాహంగా విద్యార్థుల విజ్ఞాన యాత్ర



వార్ మెమోరియల్ పార్క్‌లో యుద్ధ విమానం నమూనా వద్ద విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సెకండరీ విద్యార్థులకు ఎక్స్‌పోజర్ టూర్ విత్ఇన్ ద స్టేట్‌లో భాగంగా జిల్లాలోని వివిధ పాఠశాలల్లో 7,8,9 తరగతులు చదువుతున్న 108 మంది విద్యార్థులను విజ్ఞాన యాత్రకు తీసుకువెళ్లినట్టు జిల్లా సైన్స్ అధికారి ఎస్‌వీఎస్ సోమయాజులు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 28వ తేదీ రాత్రి 10 గంటలకు స్థానిక కేపీడీటీ హైస్కూల్ నుంచి మూడు ప్రత్యేక బస్సుల్లో బయలుదేరి 29న విశాఖపట్నం చేరుకున్నామని, 10 గంటలకు ఆంధ్ర యూనివర్సిటీ జువాలజీ, బాటని, ఫిజిక్స్ ల్యాబ్‌లను తమ విద్యార్థులు సందర్శించారన్నారు. అనంతరం కైలాసగిరి, అక్కడి నుంచి ఆర్కే బీచ్‌లో సబ్ మెరైన్ మ్యూజియం, ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం, వార్ మెమోరియల్ పార్క్ వంటి ప్రదేశాలు చూసి రాత్రి 9 గంటలకు తిరుగు ప్రయాణమయ్యామన్నారు. యాత్రలో 108 మంది విద్యార్థులకు, 11 గైడ్ టీచర్లు సహాయకులుగా వ్యవహరించారని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్‌ల సహకారంతో విద్యాశాఖ ఏడీ–1 అవధాని సూచనలతో యాత్రను విజయవంతంగా ముగించామన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

అమ్మవార్ల ఆలయాల వద్ద ఉగాది శోభ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సత్రంపాడు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని విశేషంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్. చిన నాగేశ్వర రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

నూకాలమ్మ ఆలయంలో..

స్థానిక కొత్తపేట శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో ఉగాదిపర్వదినం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి చల్ది నైవేద్యం సమర్పించారు. అనంతరం పసుపు, కుంకుమలతో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి వివిధరకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు మంత్రవాది రామకృష్ణ యోగానంద శర్మ భక్తుల గోత్ర నామాలతో అష్టోత్తర పూజలతో పాటు విశేష పూజలు నిర్వహించగా, ఆలయ కమిటీ అధ్యక్షుడు దావాల రంగ సత్యనారాయణ కార్యక్రమాలు పర్యవేక్షించారు.



ప్రత్యేకాలంకరణలో సత్రంపాడు లక్ష్మీ గణపతి స్వామి



నూకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

అప్పనవీడులో ఉగాది వేడుకలు

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేస్వామి ఆలయంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించారు. అనంతరం అర్చకులు పంచాంగ శ్రవణం చేశారు. మాజీ చైర్మన్‌లకు పంచాంగం కానుకగా అందించారు. వట్లూరు సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు రంజాన్ ప్రార్థనలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రంజాన్ నెల ఉపవాస దీక్షలు ఈ నెల 2వ తేదీ నుంచి అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ముస్లింలు ఆదివారం నాటితో తమ ఉపవాస దీక్షలు ముగించారు. రంజాన్ మాస ఉపవాస దీక్షలు ముగిసిన నేపథ్యంలో సోమవారం రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకోవడానికి సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు నగరంలోని వివిధ ప్రార్థనా మైదానాలను, మసీదులను ఇప్పటికే విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్థానిక వంగాయగూడెం రోడ్డులోని ఈద్‌గాహ్ ప్రాంగణంలో ప్రభుత్వ ఖాజీ షేక్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. అలాగే నగరానికి చెందిన అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండు సెంటర్‌లోని కర్బలా మైదానంలో ఉదయం 9 గంటలకు ప్రార్థనలు ప్రారంభించనున్నారు. ఆయా ప్రాంగణాల్లో నిర్వహించే ప్రార్థనల్లో ముస్లిం మతపెద్దలు పాల్గొని రంజాన్ మాసం ప్రాశస్త్యాన్ని వివరించనున్నారు. జకాత్, ఫిత్రా దానాల ప్రాధాన్యతలపై అవగాహన కలిగిస్తారు. కాగా నగరంలో స్థానిక లక్ష్మీవారపు పేటలోని అహలే హదీస్ మసీదు,ఉమర్ ఏ ఫరూఖ్ మసీదు, మర్కజ్ ఈనామ్ మసీదు, తంగెళ్ళమూడిలోని నెహర్ మసీదు, రాణీ నగర్‌లోని పురానా మసీద్, నయా మసీదు జామియా మసీదు, చౌక్ మసీదు, ఖురేషీ మసీదు, నాథూమియా మసీదు, మదీనా మసీదు, అక్కిలేట్ మసీదు, ఎంఎం కాలనీ మసీదు, మాదేపల్లి మసీదు, గేట్ మసీదు, జుమీరాత్ మసీదు, బీడీ కాలనీ మసీదు, ఇస్లాం పేట మసీదు, ఫాతిమా మసీదు, జిల్లా మసీదు, శనివారపు పేట మసీదు, దొండపాడు మసీదు, మహ్మదీయ మసీదు, వైఎస్ఆర్ కాలనీ మసీదు, తబ్‌లిక్ జమాత్ మసీదు, నూర్ మసీదుల్లో సైతం ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాటు చేశారు.

రమాకుమారికి సాహిత్య పురస్కారం అందజేత

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామకృష్ణాపురం సాహిత్య మండలిలో ఆదివారం నిర్వహించిన ఉగాది సాహిత్యోత్సవ సభలో నగరానికి చెందిన ప్రముఖ నేత్రావధాని కాశీభొట్ల రమాకుమారికి పుల్లాభొట్ల శ్రీరామమూర్తి సాహిత్య పురస్కారం అందజేశారు. వివిధ రంగాలలో విశేష సేవలు అందించిన నిడమర్తి లలితా కామేశ్వరి (సాహిత్య రంగం), వెంపరాల రామలక్ష్మి (సంగీత రంగం), ఎంవీ రమణ (పౌరాణిక నాటక రంగం), రమ్యకృష్ణ (సాంఘిక నాటక రంగం), కిళాంబి పూర్ణశ్రీ (నృత్య రంగం), పోడూరి కనక దుర్గ (సేవారంగం) తదితరులను ఉగాది పురస్కారాలతో సత్కరించారు. అలాగే నాట్యాచార్య దువ్వి హేమసుందర్ శిష్య బృందం నిర్వహించిన స్వాగత నృత్యం సభికులను ఎంతగానో ఆకట్టుకుంది. తొలుత వేదాంతం విష్ణుప్రియ పంచాంగ శ్రవణం నిర్వహించారు. సాహిత్య మండలి భవన అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన నూతన ద్వారాన్ని సంస్థ ఉపాధ్యక్షుడు గరికపాటి కాళిదాసు ప్రారంభించారు. సభా కార్యక్రమంలో పెదపాటి రామకృష్ణ, చప్పిడి సత్యనారాయణ, ఈదర రమణ ప్రసాద్, ఆలపాటి నాగేశ్వర రావు ఆత్మీయ అతిథులుగా పాల్గొని సాహిత్య మండలి స్థాపన గురించి దాని అభివృద్ధికి సంస్థ కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తమ రావు చేస్తున్న కృషి గురించి తెలిపారు. సంస్థ అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించిన ఆలపాటి నాగేశ్వర రావు, పెదపాటి రామకృష్ణ, పుల్లాభొట్ల సత్యవాణి, పుల్లాభొట్ల మధుసూదన్, సంస్థకు నూతన మైక్‌సెట్ అందించిన పద్మకుమారి శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించారు.



నేత్రావధాని రమాకుమారికి సాహిత్య పురస్కారం అందిస్తున్న సాహిత్య మండలి ప్రతినిధులు



అలరించిన చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన



వృద్ధులకు పండ్లు అందిస్తున్న సత్రంపాడు వాకర్స్

వైఎంహెచ్‌ఏ హాలులో

నగరానికి చెందిన హిందూ యువజన సంఘం 121 వసంతాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలపాటి అనసూయమ్మ లలిత కళానిలయం విద్యార్థులు నాట్యాచార్య గండికోట రాజేష్ శిష్య బృందం కూచిపూడి నృత్య రూపకాలను అద్భుతంగా ప్రదర్శించారు. అనంతరం నగరానికి చెందిన జోస్యుల చంద్రశేఖరేంద్ర శర్మ, జోస్యుల వెంకట సూర్య జయేంద్ర శర్మ శిష్య బృందం వేదస్వస్తి పలికారు.కార్యక్రమంలో సంస్థ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, మజ్జి కాంతారావు, పెదపాటి రామకృష్ణ, ఆర్ఎస్ఆర్ నాగేశ్వర రావు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ

ఏలూరు రూరల్/ఏలూరు (టూటౌన్): ఉగాది పురస్కరించుకుని ఆదివారం నగరంలోని వాకర్స్ అసోసియేషన్స్ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. సత్రంపాడు వాకర్స్ అసోసియేషన్ స్థానిక రామకృష్ణపురంలోని సత్యసాయిబాబా వృద్ధుల ఆశ్రమంలో అసోసియేషన్ ప్రసిడెంట్ సల్వాది ప్రసాద్, మాజీ ఎపీపీ పిన్నాక ఆంజనేయులు, లంకా కోటేశ్వరరావు పండ్లు అందించారు. అలాగే ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేదాంత విష్ణుప్రసాద్ విశ్వావసు ఉగాది పంచాంగ పఠనం చేశారు. కార్యక్రమంలో బుద్దాల శ్రీనివాసరావు, గుంటూరు రామరాజు, ఎస్ కృష్ణమూర్తి పాల్గొన్నారు. అలాగే ఏలూరు శ్రీరామ్ నగర్ లోని తపన ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. గారపాటి సీతారామాంజనేయ చౌదరి, రేణుక దంపతులు ఉగాది పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	50
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	10–15
బెండకాయలు	28	కంద	76
పచ్చిమిర్చి	26	బీట్‌రూట్	30
కాకర కాయలు	28–36	కీరా దోస	36
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	48	అల్లం	60
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	28	చుక్కకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	30	గోంగూర	07
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	24–30	బఠాణి	--
ఆనపకాయ (1)	20	క్యాప్సికమ్	50
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	03
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	03
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	04
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	27

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	01
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	02
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.30	4800	00
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	02
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	04
ఏలూరు –తిరుపతి	16.00	4830	32
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.00	98516	34
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.10	98503	34

దీక్షాధారుల ప్రత్యేక ప్రార్థనలు



దీక్షాధారులతో ప్రత్యేక పూజలు చేస్తున్న పాస్టర్లు

దెందులూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండేటి గంగాధర్ బాబు నివాసంలో మూడు గ్రామాల దీక్షాదారులు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరిపారు. ఈ సందర్భంగా గంగాధర్ బాబు దంపతులను దీక్షదారులు, పాస్టర్లు అభినందించారు. రెండు దశాబ్దాలుగా మూడు గ్రామాలకు చెందిన 200 మంది దీక్షదారులకు ప్రతి ఏటా ప్రత్యేక ప్రార్థనలు, భోజన వసతి కల్పిస్తున్న గంగాధర్ బాబు అభినందనీయమని దీక్షాదారులు పేర్కొన్నారు.

విర్డ్ ట్రస్ట్‌లో సభ్యులుగా ఇద్దరికి చోటు

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రి ట్రస్టు నూతన సభ్యులుగా శ్రీవారి దేవస్థానం అనువంశిక ధర్మకర్త వీఎస్ఎన్ నివృతరావు, డాక్టర్ భవ్యచంద్ నియమితులయ్యారు. ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు అధ్యక్షతన ఆదివారం ఆస్పత్రిలో ట్రస్టుబోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నివృతరావు, భవ్యచంద్‌లను సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం సభ్యులంతా కలసి ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ప్రోస్తాసిస్ 3డీ ప్రింట్ కృత్రిమ అవయవాలను 15 మంది దివ్యాంగులకు అందజేశారు.

రాట్నాలమ్మ సన్నిధిలో పంచాంగ శ్రవణం



ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న స్థానిక నాయకులు, భక్తులు

పెదవేగి: శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ఉగాది పర్విదినాన్ని పురస్కరించుకుని పెదవేగి మండలం రాట్నాలకుంట శ్రీ రాట్నాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రాట్నాలకుంట, రాయన్నపాలెం, కొండలరావుపాలెం, గ్రామాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల సమక్షంలో ఆలయ అర్చకుడు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణ శర్మ పంచాంగ శ్రవణం జరిపారు. రాశిఫలాలు వినిపించారు. అనంతరం త్వరలో నిర్వహించబోయే అమ్మవారి ఉత్సవాలకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. పందిరి రాటను పాతి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో ఎన్ సతీష్‌కుమార్, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

భార్యపై దాడి.. భర్తపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: భార్యను కొట్టి గాయపర్చిన నేరంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. వివరాల ప్రకారం మైసన్నగూడెంకు చెందిన షేక్ బషీర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతడు తరచూగా భార్య గౌసియాబేగంతో గొడవ పడుతూ కొడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం మద్యం సేవించి వచ్చిన బషీర్ మోటార్‌సైకిల్ కొనివ్వలేదని ఇనుపరాడ్డుతో భార్య గౌసియాబేగంపై దాడి చేశాడు. గాయపడిన ఆమె స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈమేరకు బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

మినీ గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి

దెందులూరు: మెట్ట గ్రామాల్లో మినీ గ్రంథాలయం ఏర్పాటు చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. దెందులూరు గ్రామం దాటిన తర్వాత పెరుగ్గూడెం వరకు గ్రంథాలయంగానీ, మినీ గ్రంథాలయంగానీ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు స్పందించి మెట్ట గ్రామాల్లో కనీసం మినీ గ్రంథాలయం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.